తెలుగు దినపత్రిక
ప్రభాత
jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర ర...
సంపుటి : 01
సంచిక : 136
పేజీలు : 4
వెల : 4
మల్కాజిగిరి
మంగళవారం, 05-12-2023

జయభేరి దినపత్రిక,
జయభేరి ఛానల్ లో
నిఖార్సైన
జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా?
ఆసక్తి కలిగిన యువతి
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
email: jayabherinews@
gmail.com,
www.jayabheridaily.com
Call me: 9391 544 889

JB TV
జయభేరి



# రేవంత్ వైపే

కాంగ్రెస్‌లో హైడ్రామా
ఇంకా తేలని ముఖ్యమంత్రి అభ్యర్థి..
ఢిల్లీకి చేరిన ఎంపిక వ్యవహారం
ఏకవాక్య తీర్మానంతో నిర్ణయం బాధ్యతను
ఖర్గేకు అప్పగించిన సీఎల్పీ
సీఎం పదవికి నాయకుల పోటీ
సీఎల్పీ సమావేశంలో నేతల వాదోపవాదాలు..
సీనియర్ల ఆగ్రహం
రేవంత్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న భట్టి,
ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర
సోమవారం రాత్రి ఢిల్లీకి బయల్దేరిన డీకే, నేతలు
రాజ్‌భవన్‌లో ప్రమాణానికి అధికారుల ఏర్పాట్లు
కాంగ్రెస్ నిర్ణయం వెలువడకపోవడంతో వాయిదా

జయభేరి, హైదరాబాద్ :

సీఎం అభ్యర్థిని ఎంపిక చేసేకుందుకు గాను ఏర్పాటు చేసిన కాంగ్రెస్ శాసనసభా పక్షసీఎల్పీ సమావేశం ముగిసింది. పార్టీ పరిశీలకులు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, జార్జ్, దీపా దాస్ మున్షి, అజయ్, మురళీధరన్, ఇంచార్జ్ మాణిక్ రావ్ ఠాక్రే తదితరులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎంపిక చేసే బాధ్యతను హైకమాండ్ కే అప్పగిస్తూ టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి సమావేశంలో ఏక వాక్య తీర్మానం చేశారు. తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, మల్లు భట్టి విక్రమార్క, కొండా సురేఖ, ప్రేమ్ సాగర్, శ్రీధర్ బాబు తదితరులు తీర్మానాన్ని బలపరిచారు. ఈ తీర్మానాన్ని ఏఐసీసీ పరిశీలకులైన కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, పార్టీ రాష్ట్ర చీఫ్ మాణిక్ రావ్ ఠాక్రే తదితరులు హైకమాండ్ కు పంపారు. సీఎల్పీ నేత ఎంపికను పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు అప్పజెప్పారు.

## జయభేరి అక్షర తూటా

ఫామ్ హౌస్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా
ఏకమై సార్ ను ఓదార్చ రు...
ప్రతిపక్ష పార్టీలో కూర్చోవడానికి సారు వస్తాడా!? రాడా!?

ఎహే ఎందుకు వస్తాడు ముఖ్యమంత్రి స్థానంలో
కలలు కంటూనే ఉంటుండొచ్చు....
కాదు... కాదు... సారు చాలా తెలివిగల్లోడు...

అందుకనే తాను రాకపోయినా కొడుకు కేటీఆర్ ను
అల్లుడు హరీష్ రావును ప్రతిపక్ష స్థానంలో
ఫ్లోర్ లీడర్ గా కూర్చోబెడతాడేమో...

ఎంతైనా సారు దొర ఆలోచనలు వేరే తీరుగా ఉంటాయబ్బ...
ఇప్పుడు ఇదే తెలంగాణలో గుసగుసలు
పెట్టుకుంటున్న సిసలైన ముచ్చట....

... కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్

మీ మాటల తూటాలను మాకు పంపండి...
మా 'జయభేరి అక్షర తుటా' తో జతవుతుంది.
+91 9391 544 889

‘జయభేరి’ కౌంటర్ విత్ కడారి కామెంట్స్ ... 2 లో



2 లో



3 లో

# మిచౌంగ్ బీభత్సం

- మత్స్యకారులు సముద్రంలోకి వేటకి వెళ్ళవద్దు
- ఎలాంటి పరిస్థితులనైనా ధీటుగా ఎదుర్కొని సహాయక చర్యలు అందించడానికి ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ బృందాలు సర్వసన్నద్ధం - జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్
- మిచౌంగ్ తుఫాన్ ముందస్తు సహాయక చర్యలలో భాగంగా సూర్యలంకలోని సముద్ర తీరాన్ని, పునరావాస కేంద్రమును పరిశీలించిన జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా IAS, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ IPS, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి.

జయభేరి, బాపట్ల :

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మరింత బలపడి తీవ్ర తుఫాన్ గా మారనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లోతట్టు ప్రాంతాలలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సీఎం జగన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల కోసం ఏర్పాటు



చేసిన క్యాంపుల్లో భోజన వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్యాంపుకు వచ్చిన కుటుంబ సభ్యులకు 2500 రూపాయలు ఇవ్వాలని, వ్యక్తికి రూ.1000 వంతున ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. రాష్ట్రంలో తుఫాను వల్ల దెబ్బతిన్న గృహాలకు పదివేల రూపాయలు నష్టపాహారం అందించాలని ఆదేశాలు జారీ చేసిన ముఖ్యమంత్రి జగన్.
బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మరింత బలపడి తీవ్ర తుఫాన్ గా మారనున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు మిగతా 2 లో



# ఎన్నికల కోడ్ ఎత్తివేత

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో ఎన్నికల కోడ్ ఎత్తివేస్తున్నట్టు ఈసీ ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే నూతన ఎమ్మెల్యేలకు సంబంధించిన వివరాలను సీఈవో వికాస్ రాజ్ రాష్ట్ర గవర్నర్ తమిళిసైకి అందజేశారు. మరోవైపు నూతన శాసనసభ ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదలైంది.

# రాజీనామాచేసిన కార్పొరేషన్ల చైర్మన్లు

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 4

మరికొన్ని గంటల్లో తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువు తీరనుండగా రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు ముకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ చైర్మన్లు తమ రాజీనామా లేఖలను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి పంపించినట్లు సమాచారం. పలు కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఉన్న డా .దూది మెట్ల బాలరాజ్ యాదవ్ రవీందర్ సింగ్, డా. వాసుదేవ రెడ్డి, మన్నే క్రిశాంక్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, పల్లె రవికుమార్ గౌడ్, పాటి మీద జగన్ మోహన్ రావు, అనిల్ కూర్మాచలం, గజ్జెల నగేష్, మేడె రాజీవ్ సాగర్, డా .ఆంజనేయులు గౌడ్, సతీష్ రెడ్డి, రామచంద్ర నాయక్, గూడూరి ప్రవీణ్, వాల్యా నాయక్ తమ చైర్మన్ పదవులకు రాజీనామా చేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో తమకు అవకాశం కల్పించిన కేసీఆర్ కి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల కనుగుణంగా పనిచేస్తాం అన్నారు. మిగతా 2 లో

# చక్రం తిప్పిన సునీల్ కనుగోలు



జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 4 :

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ విజయం వెనుక స్ట్రాటజిస్ట్ సునీల్ కనుగోలు పాత్ర చాలా ఎక్కువ. స్ట్రాటజిస్టుగా సునీల్ కనుగోలు..బాధ్యతలు తీసుకున్న తర్వాత కర్ణాటకలో గెలిపించారు. ఆ తర్వాత తెలంగాణ బాధ్యతలు తీసుకున్నారు. ఎప్పటికప్పుడు ప్రజా నాడి పడుతూ.. గెలుపు గుర్రాలైన అభ్యర్థులను ఎంపిక చేయడం దగ్గర నుంచి ప్రచార వ్యూహాలను క్రియేటివ్ గా చేయడం వరకూ మొత్తం సునీల్ కనుగోలు చూసుకున్నారు. సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటనలు.. దినపత్రికల్లో వచ్చిన ప్రకటనలు ఎంతో క్రియేటివ్ గా ఉన్నాయని చూసిన వారంతా మెచ్చుకున్నారు. అవన్నీ నిజాలేనని ఒక్కటీ అబద్ధం లేదని కాంగ్రెస్ గట్టిగా ప్రచారం చేయగలిగింది. తెలంగాణలో కాంగ్రెస్ విజయం వెనుక మిగతా 2 లో



# రెడ్ అలెర్ట్ జారీ..

## తెలంగాణలో రెండు రోజులు అత్యంత భారీ వర్షలు..!

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రంలో రాగల రెండు రోజుల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులతోపాటు గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. భూపాలపల్లి, జయశంకర్, ములుగు, వరంగల్, హన్మకొండ జిల్లాలకు రెడ్ అలెర్ట్న జారీ చేసింది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు రెడ్ అలెర్ట్న జారీ చేసింది. సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. కరీంనగర్, పెద్దపల్లి, నల్గొండ, జనగామ, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కూరుస్తాయని చెప్పింది. వరంగల్, హన్మకొండ, కరీంనగర్, పెద్దపల్లి, నల్గొండ, జనగాం, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేటతో పాటు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయని గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్న జారీ చేసింది.

jayabheridaily.com
ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## మిచౌంగ్ బీభత్సం

అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ సూచించారు. బాపట్లకు ఈశాన్య దిశలో 710 కిలోమీటర్ల దూరంలో బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర వాయుగుండం డిసెంబర్ 3 వ తేదికి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉంటుందన్నారు. దీని ప్రభావం బాపట్ల జిల్లాపై ఎక్కువగా చూపే అవకాశం ఉన్నందునా సముద్ర తీరం వెంబడి నివసిస్తున్న ప్రజలు పోలీస్, రెవెన్యూ అధికారులు సూచించిన విధంగా సురక్షిత ప్రాంతాలకు లేక తుఫాన్ షెల్టర్ కు వెళ్ళాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని, సముద్ర తీర బీచ్ ల వద్దకు పర్యాటకులు ఎవరు రావద్దని ఎస్పీ హెచ్చరించారు. తీరం వెంట పెరుగుతున్న అలల తాకిడిచీరాల, చినగంజాం, వేటపాలెం లో భారీ వర్షం. తీరం వెంట పెరుగుతున్న అలల తాకిడిచీరాల, చినగంజాం, వేటపాలెం లో భారీ వర్షం. చీరాల చిన్నగంజాం వేటపాలెం లో తీరం వెంట పెరుగుతున్న అలల తాకిడి.

లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైన ప్రాంతాలలో సహాయక శిబిరాలు, పునరావాస కేంద్రాలు గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఈదురు గాలులకు రోడ్లపై విరిగిపడే చెట్లను, కరెంట్ స్తంభాలను వెంటనే తొలగించి ప్రయాణాలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చేయడానికి సంబంధిత సామాగ్రి వాహనాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్న నదీ పరీవాహక ప్రాంతాలలో ముమ్మరంగా గస్తీ నిర్వహించాలన్నారు. ప్రయాణించేందుకు అనువుకాని మార్గాలలో, నీట మునిగిన రహదారుల వద్ద పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి రహదారులను మూసివేసి ఇతర మార్గాల ద్వారా వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. లైఫ్ జాకెట్స్, లైఫ్ బాయ్, రొప్స్ లతో పోలీసులు, గజ ఈతగాళ్లను సిద్ధం చేసుకోవాలని, వారిని లోతట్టు ప్రాంతాలలో నియమించాలన్నారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేస్తూ దానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులకు సూచించారు. ఆపదలో ఉన్న ప్రజలను రక్షించడానికి పోలీస్ శాఖ ఎప్పుడు సిద్ధంగా వుంటుందని, ఎలాంటి పరిస్థితులనైనా ధీటుగా ఎదుర్కొని సహాయక చర్యలు అందించడానికి ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని, అత్యవసర పరిస్థితులలో తక్షణ సహాయం కొరకు డయల్ 100, 112 (లేదా) పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8333813228 (లేదా) స్థానిక పోలీసు అధికారులకు సమాచారమివ్వాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.

## చక్రం తిప్పిన సునీల్ కనుగోలు

రేవంత్ సహా తెలంగాణ కాంగ్రెస్ నేతలు కష్టపడి పనిచేయడంతో పాటు సునీల్ వ్యూహాలూ కలిసొచ్చాయని ప్రత్యేకంగా చెప్పాల్సినపని లేదు. సునీల్ కనుగోలు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ టాస్క్ ఫోర్స్ సభ్యుడిగా పనిచేస్తున్నారు. ఈయన బళ్ళారిలో తెలుగు మాట్లాడే కుటుంబంలో జన్మించారు. చెన్నైలో చదువుకున్నారు. అమెరికాలో ఏంబీఏ చేశారు. అక్కడే ఓ కన్సల్టెన్సీ సంస్థలో పనిచేశారు. అసోసియేషన్ ఆఫ్ బ్రిలియంట్ మైండ్స్ (ఏబీఎం) కు సహవ్యవస్థాపకుడిగా సునీల్ కనుగోలు రాజకీయ వ్యూహకర్త ప్రయాణం మొదలుపెట్టారు.ఈ సంస్థ భారతీయ జనతా పార్టీ కోసం ఎన్నికల వ్యూహాలు రూపొందించింది. 2014లో నరేంద్రమోదీని ప్రధాని అభ్యర్థిగా ప్రచారం చేయడానికి ప్రశాంత్ కిషోర్ తీసుకువచ్చిన సిటిజెన్స్ ఫర్ అకౌంటబుల్ గవర్నెన్స్ లో సునీల్ భాగస్వామిగా ఉన్నారు. తర్వాత ప్రశాంత్ కిషోర్ తో విడిపోయి సొంత కన్సల్టెన్సీని పెట్టుకున్నారు. 2022లో కాంగ్రెస్ పార్టీ కీలక ఎన్నికల వ్యూహకర్తగా నియమితులయ్యాక సోనియాగాంధీ ఈయనను 2024 లోక్సభ పోల్స్ టాస్క్ ఫోర్స్ సభ్యునిగా నియమించారు.కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు వెనుక సునీల్ కనుగోలు విభిన్నమైన ఆలోచనలు, చక్కని ఇన్ పుట్స్ ఉన్నాయి. కర్ణాటక ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బొమ్మైపై 40 శాతం కమీషన్ తీసుకుంటున్నారంటూ కర్ణాటక కాంట్రాక్టర్స్ అసోసియేషన్ చేసిన ఆరోపణలను కాంగ్రెస్ ప్రచారాస్త్రంగా మార్చడంలో సునీల్ సక్సెస్ అయ్యారు. 'పేసీఎం' పేరుతో సామాన్యుల వరకు ఈ ప్రచారాన్ని తీసుకువెళ్ళారు. అలాగే అమూల్ వర్సెస్ నందినీ డెయిరీ వ్యవహారాన్ని కన్నడిగుల ఆత్మగౌరవంతో ముడిపెట్టడంతో సునీల్ వ్యూహాలు బలంగా పనిచేశాయి. ఐదు గ్యారంటీలతో చేసిన ప్రచారం ప్రజల్లోకి వెళ్లింది. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గెలవగానే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సునీల్ కనుగోలును తన సలహాదారుగా నియమించుకుని కేబినెట్ ర్యాంక్ ఇచ్చారు. కానీ ఆ పదవిలో సునీల్ కనుగోలు చేరలేదు. తెలంగాణలో రూ.500లకే గ్యాస్ సిలెండర్, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ. 2500 , ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతుభరోసా కింద ఇస్తున్న మొత్తాన్ని రూ.15వేలకు పెంచడం, కౌలు రైతులకూ ఈ పథకం వర్తింపజేయడం, వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు, వరిపంటకు ఏడాదికి రూ. 500 బోనస్, గృహజ్యోతి కింద ప్రతి ఇంటికి రూ. 200 యూనిట్ల విద్యుత్తు ఉచితంగా ఇవ్వడం, ఇందిరమ్మ ఇళ్ళు, యువ వికాసం, చేయూత పథకాలతో కాంగ్రెస్ పార్టీ సామాన్యుల మనసు గెలుచుకునేలా మేనిఫెస్టో రూపొందించడంలో సునీల్ కనుగోలు కీలక పాత్ర పోషించారు. కర్ణాటకతో పాటు తెలంగాణ కోసం వ్యూహాలు సిద్ధం చేస్తూ వస్తున్న సునీల్ కనుగోలు టీం హైదరాబాద్ లో ఓ వార్ రూంను ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆ వార్ రూపంపై 2022 డిసెంబరులో తెలంగాణ పోలీసులు దాడి చేశారు. మైండ్ షేర్ ఎనలిటిక్స్ పేరుతో నడుస్తున్న కార్యాలయం నుంచి కంప్యూటర్లు తీసుకెళ్లారు. ఆయనపై కేసులు పెట్టారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గౌరవానికి భంగం కలిగించే రీతిలో సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెడుతున్నారంటూ కేసు నమోదు చేశారు. ఆయన విచారణకు కూడా హాజరయ్యారు. ఓ సందర్భంలో అరెస్టు చేస్తారన్న ప్రచారం జరిగింది. తెలంగాణలో పారిన సునల్ కనుగోలు వ్యూహాలు ఎన్నికలు జరిగిన మధ్యప్రదేశ్, చత్తీస్ ఘడ్, రాజస్థాన్ లలో ఎందుకు పారలేదన్నది చాలా మందికి వచ్చే డౌట్. అయితే అక్కడ ఉన్న కాంగ్రెస్ పెద్ద నాయకులు అశోక్ గెహ్లాద్, కమల్ నాథ్ వంటి వారు సునీల్ కనుగోలుకు హిందీబెల్ట్ రాజకీయాల గురించి తెలియదని.. ఆయన సలహాలు సూచనలు పాటించలేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అందుకే ఆయన ఎక్కువగా తెలంగాణపై దృష్టి సారించారని అంటున్నారు.

## రాజీనామా చేసిన కార్పొరేషన్ల చైర్మన్లు

1. సోమ భరత్ కుమార్ చైర్మన్, రాష్ట్ర డెయిరీ డేవలప్మెంట్ కార్పొరేషన్
2. జూలూరి గౌరీ శంకర్ చైర్మన్, తెలంగాణ సాహిత్య అకాడమీ
3. పల్లె రవి కుమార్ గౌడ్ చైర్మన్, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్
4. డాక్టర్ ఆంజనేయ గౌడ్ చైర్మన్, స్పోర్ట్స్ అథారిటీ
5. మేడె రాజీవ్ సాగర్ చైర్మన్, TS Foods Corporation
6. డా. దూదిమెట్ల బాలరాజు యాదవ్ చైర్మన్, గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ
7. గూడూరు ప్రవీణ్ చైర్మన్, టెక్స్టైల్స్ కార్పొరేషన్
8. గజ్జెల నగేష్ చైర్మన్, బేవరేజెస్ కార్పొరేషన్
9. అనిల్ కూర్మాచలం చైర్మన్, ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్
10. రామచంద్ర నాయక్ చైర్మన్, ట్రైకార్
11. వలియా నాయక్ చైర్మన్, గిరిజన ఆర్థిక సహకార సంస్థ
12. వై సతీష్ రెడ్డి చైర్మన్,
13. డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ చైర్మన్, రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ
14. రవీందర్ సింగ్ చైర్మన్, పౌర సరఫరాల సంస్థ
15. జగన్మోహన్ రావు చైర్మన్, రాష్ట్ర టెక్నాలజికల్ సర్వీసెస్

ట్రాన్స్ కో, జెన్ కో సీఎండీ ప్రభాకర్ రావు రాజీనామా

తెలంగాణ ట్రాన్స్ కో, జెన్ కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) డి. ప్రభాకర్ రావు తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల తాను రాజీనామా చేస్తున్నట్లుగా ప్రభాకర్ రావు వెల్లడించారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి 25 అక్టోబర్ 2014 నుంచి టీఎస్ ట్రాన్కో, జెన్ కోకు సీఎండీ హోదాలో కొనసాగుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అవుతున్న సమయంలో తన పదవికి ఆయన రాజీనామా చేశారు.

టాస్క్ ఫోర్స్ ఎస్టీ రాధాకిషన్ రావు రాజీనామా...


తన ఉద్యోగానికి టాస్క్ ఫోర్స్ ఎస్టీ రాధాకిషన్ రావు రాజీనామా చేశారు. అయితే మూడేళ్ల కిందటే ఆయన పదవీకాలం ముగిసినా, ఇంకా టాస్క్ ఫోర్స్ లోనే కొనసాగుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న తరుణంలో తన రాజీనామాను ప్రభుత్వానికి పంపించారు రాదా కిషన్ రావు.

### కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్

### అహంకారానికి ఆత్మగౌరవానికి మధ్య జరిగిన పోరాటం..

# ఈ గెలుపు ప్రజల ఆత్మగౌరవానిదే..!

**అహంకారానికి, ఆత్మ గౌరవానికి జరిగిన పోరాటం.. తెలంగాణ చరిత్రలోనే ఇదో మరపురాని ఘట్టం.. చరిత్రలో ఎంతోమంది నేతలు ప్రజాస్వామ్యం పరిపాలనలో తమ ఉనికిని చాటుకున్నారు... వారిలో జ్యోతి బసు ఏకంగా 27 ఏళ్లు పరిపాలన కొనసాగించి ప్రజా మన్ననలను పొందుకున్నాడు.. అలాంటి కోవలోనే వస్తాడు అనుకున్న కెసిఆర్ తొమ్మిదిన్నర సంవత్సరాలకి ఎందుకు ప్రజల మనసులో స్థానాన్ని సంపాదించుకోలేకపోయాడు.. అది స్వయంకృత అపరాధమ!? కుటుంబంలోని వ్యక్తులు ఆయనను ఒత్తిడి చేసి పరాభవానికి గురి చేశారా!? పాలన పరిపాలకులుగా ఎన్నికైన ఎమ్మెల్యేల పనితీరు బాగోలేకన!? ఏక పక్ష నిర్ణయాలే కొంప ముంచాయ ? ఇలాంటి ఎన్నో విషయాలపై జయభేరి కుండబద్దలు కొట్టే నిజాలను కౌంటర్ విత్ శ్రీనివాస్ కథనం...**



జయభేరి, హైదరాబాద్ :

భారతీయ ఇతిహాసాలలో కర్ణుడి చావుకు వంద కారణాలు అన్నట్టుగా..మలిదశ తెలంగాణ రాష్ట్ర చరిత్రలో తెలంగాణ ఉద్యమ నాయకుడిగా ప్రజలను ఒక్కతాటిపై నడిపిన తెలంగాణ ఉద్యమ ధీరుడు కేసీఆర్.... ఆయన పూర్తి పేరు కల్వకుంట్ల చంద్రశేఖర రావు..అలాంటి కెసిఆర్ కే ఓటమి వెంటాడింది.అది స్వయంకృత అపరాధమే...

ఒక మాటలో చెప్పాలంటే ఆయన అడ్మినిస్ట్రేషన్, టిడిపి నుంచి ఆయన నేర్చుకున్న రాజకీయ అనుభవం, కేంద్ర మంత్రిగా, ఎమ్మెల్యేగా ఎంతో అనుభవాన్ని ఘటించాడు. మనం ఒకరి దగ్గర పని చేసేది ఏంటి? మనమే మన రాష్ట్రాన్ని సాధించుకోలేమా? అన్న ఒకే ఒక్క కారణంతో మలిదశ తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. నాటి కల్వకుంట్ల చంద్రశేఖర రావు.. మలిదశ తెలంగాణ పోరాట ఉద్యమాన్ని ప్రపంచస్థాయికి తీసుకువెళ్ళి ప్రపంచాన్నే అబ్బురపరిచి భారతీయ రాజకీయ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించబడే ప్రత్యేక రాష్ట్రాన్ని భారత రాజ్యాంగ ప్రకారం ఆర్టికల్ 3 నీ అనుసరించి ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఆవిష్కరించారు. . దీనికి పట్టిన సమయం 14 ఏళ్లు.. ఇదంతా తెలంగాణ చరిత్ర. కానీ ఆ చరిత్ర ఇప్పుడు కనుమరుగైపోయే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే నాడు ఉద్యమ పార్టీగా ఆవిర్భవించిన తెలంగాణ పార్టీ, రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారతీయ రాష్ట్ర సమితిగా ఏర్పడిన పిదప ప్రజల ఆదరాభిమానాలను పోగొట్టుకుంది.. అదేదో.. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలిక ఊడిపోయింది అన్నట్టుగా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమాన్ని మరింతగా మెరుగుపరిచిన, ప్రజల ఆర్థిక జీవన విధానాన్ని మార్చేసే దిశగా చేసినా, ముచ్చటగా మూడవసారి ప్రజలు అవకాశం ఇచ్చేవారు.. కానీ జరిగింది ఏమిటి!? వాస్తవ పునాదుల మీద నవనిర్మాణం చేయాల్సిన తెలంగాణ రాష్ట్ర సమితి, భారతీయ రాష్ట్ర సమితి ఏర్పడి అహంకార పూరితమైన మాటలతో రాజకీయంలో వాడని పద సంభాషణలతో తెలంగాణ భాషని పూర్తిగా వక్రీకరించి సన్నాసి, దద్దమ్మ లాంటి పదాలను ఉపయోగిస్తూ తెలంగాణ సీఎం గా తన పరువును తానెపోగొట్టుకున్నాడు. మాటల మాంత్రికుడుగా పేరు పొందుకున్నారు. అంతేకాదు..

**ఏనాడైతే ఆత్మగౌరవ నినాదంతో తెలంగాణ ఉద్యమంలో నాలుగున్నర కోట్ల ప్రజలని తన గొంతుతో ఏకం చేసిన ఆనాటి కేసిఆర్, రెండు దఫాలుగా అధికారం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ గా మారిపోయిన పిదప.. నేను వెలమజాతికి చెందిన వాన్ని వ్యవసాయదారుడుని అనే మాటలు పదేపదే పలుకుతూ వచ్చారు. అదే ఇప్పుడు తెలంగాణ సమాజాన్ని ఆలోచనలో పడేసేలా చేసింది.. అంతేకాదు ఏకపక్ష నిర్ణయాలు కనీసం సాటి ఎమ్మెల్యేలను, తోటి మంత్రులను సైతం లెక్కచేయని వైనం, మొత్తానికి కుటుంబ పాలన దిశగా తెలంగాణ రాష్ట్రాన్ని తమ సొంత ఇంటి ప్రాపర్టీగా వాడుకున్నాడు కేసీఆర్..**

అందుకే 2014లో అధికారం ఇచ్చిన తెలంగాణ ప్రజలు, అరే తెలంగాణను అభివృద్ధి చేసే విషయంలో ఐదు సంవత్సరాలు సరిపోలేదు.. మరో ఐదు సంవత్సరాలు అవకాశం ఇద్దాం.. అని జాలిపడి దయచూపి అవకాశం ఇచ్చారే కానీ, తానేదో పొడుస్తాడు, సాధిస్తాడు అనుకొని కాదు... అదికాక జై తెలంగాణ అంటే కోటి గొంతులు జై తెలంగాణ అనే ఆత్మ గౌరవానికి ప్రతిగా నిలిచే ఆ స్వరం భారతీయ రాష్ట్ర సమితిగా ఏర్పడిన తర్వాత అది పూర్తిగా అంతరించిపోయింది... జై తెలంగాణ నినాదమే లేకపోతే ఆనాడు ఉద్యమం బలపడేదా!? జై తెలంగాణ అనే నినాదం జనమంతా గర్జించకపోతే తెలంగాణ రాష్ట్ర కల నిజమయ్యేన!? అన్నది జవాబు లేని ప్రశ్నలు గా మిగిలిపోతాయి..

**2014లో తొలిసారి రాజకీయ పార్టీగా మారిన ఉద్యమ పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి మొదటిసారి తెలంగాణ రాజకీయ చరిత్రలో మొదటిసారి గెలిచి సువర్ణ అక్షరాలతో తన పేరును లిఖించు కుంది. మరి ఆంధ్రప్రదేశ్లో కారు చీకట్లో మగ్గిన తెలంగాణ సమాజాన్ని వెలుగు వైపు నడిపించడానికి మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్రానికి సీఎంగా పదవీ ప్రమాణం చేసిన నాటి నుండి అంటే 2014 సంవత్సరం ఆ రోజు నుండి కెసిఆర్ 2018 వరకు ఎంతో కష్టపడి ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చి భారతదేశానికి దిక్సూచిగా మారాడు... అలాంటి కెసిఆర్ ముచ్చటగా మూడవసారి ఎందుకు అధికారాన్ని దక్కించుకోలేకపోయాడన్న సందేహం ఇప్పుడు అందరిని వేధిస్తోంది.. ఆయన చేసిన తప్పేంటి?**

2014లో తెలంగాణ రాష్ట్ర సమితి ఉద్యమ పార్టీగా అవతరించి రాజకీయ పార్టీగా పురుడు పోసుకుంది... దీని వెనక ఓ చరిత్ర దాగి ఉంది... ఇది బహిరంగ రహస్యమే అయినా మల్లొకసారి యాది చేసుకోవాలి... డిసెంబర్ 9 ప్రకటన తర్వాత తెలంగాణ రాదేమో అన్న సందేహంతో ఇదే ఎల్బీనగర్ సాక్షిగా శ్రీకాంతాచారి బలిదానం మొదలైంది. ఆ నాటి నుండి వందల కొద్ది తెలంగాణ విద్యార్థులు తెలంగాణ బిడ్డలు తెలంగాణ రాష్ట్రం కోసం తమ ప్రాణాలను త్యజించి రాష్ట్రాన్ని అందివ్వండి అంటూ తమ ఊపిరిని రాష్ట్ర భవిష్యత్తుకు ధారపోశారు.. అప్పుడే తెలంగాణ రాష్ట్ర సమితి ఉద్యమ పార్టీకి అధ్యక్షుడిగా ఉన్న కేసీఆర్ హుటాహుటిన ఢిల్లీకి పయనమై తమ కుటుంబ సభ్యులతో ఆనాడు ఏఐసీసీ ప్రెసిడెంట్ గా ఉన్న శ్రీమతి సోనియా గాంధీ దగ్గర నిలబడి చేతులు కట్టుకొని అమ్మ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే... తెలంగాణ రాష్ట్ర సమితి రాజకీయ పార్టీని కాంగ్రెస్లో కలిపేస్తాను మీ మేలు మరిచిపోలేను నా తెలంగాణ బిడ్డలు చనిపోతున్నారు!! అని మొసలి కన్నీరు కార్చలేద...? ఆనాడు సోనియాగాంధీ ధైర్యసహసాలతో తెలంగాణ బిడ్డలు చనిపోతున్నారు అనే ఒక ఆవేదనతో తల్లిగా ప్రసవ వేదన తెలిసిన మాతృమూర్తిగా ఆలోచించి రాజ్యాంగ నిపుణులతో చర్చించి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే...

**ఆ రోజే ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని పూర్తిగా మీరు తెలుగు రాష్ట్రాలలో లేకుండా చేసిన ఘనత ఎవరికి దక్కుతుందో వేరే చెప్పాలా!? నిజానికి రాష్ట్రం వేరు చేస్తే రెండు తెలుగు రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ ఉనికి కోల్పోతుంది.. అని తెలిసిన, ఆనాడు రాష్ట్రాన్ని ఇవ్వడానికే మొగ్గు చూపిన శ్రీమతి సోనియా గాంధీ 10 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీని అధికారంలో లేకుండా చేసిన, ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కనీసం పల్లెత్తు కామెంట్ అయినా చేయలేదు... ఎందుకంటే జాతీయ పార్టీకి చెందినా అధ్యక్షురాలుగా ఉన్న శ్రీమతి సోనియా గాంధీ ధార్మనికతకు రాజకీయ అనుభవానికి నిదర్శనంగా ఆనాడే ఆమె తన ఓపికను పెట్టుబడిగా పెట్టింది...**

దాని ఫలితం తెలంగాణ రాష్ట్రంలో 2014 నుండి 2018 వరకు అంటే రెండు దఫాలుగా అధికారం కోల్పోయి కనీసం అస్తిత్వ పోరాటానికి నడుము కట్టి కాంగ్రెస్ పార్టీని తెలంగాణ రాష్ట్రంలో బూతు స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు తీసుకురావడానికి ఎన్నో యాత్రలు ఎన్నో మీటింగులు ఎన్నో బహిరంగ సభలు నిర్వహించిందో.... అలాంటి కాంగ్రెస్ పార్టీని మనందరం మర్చిపోలేం... అలాంటి కాంగ్రెస్ పార్టీని మొదటి దశలోనే తుడిచిపెట్టిసిన తెలంగాణ సీఎం కేసీఆర్, అధికారం చలాయిస్తున్న క్రమంలో ఎంత మందిని తమ సొంత అనుకున్న వాళ్ళని పక్కకు నెట్టి బహిష్కరించాడో మనందరికీ తెలిసిందే...



...కడారి శ్రీనివాస్
సీనియర్ రాజకీయ విశ్లేషకులు
9848 962 799

ఇది వ్యక్తిగతంగా చంద్రశేఖర రావుకు కరెక్టే అనిపించిన, తెలంగాణ సమాజం జీర్ణించుకోలేదు.. ఎందుకంటే ప్రత్యేక తెలంగాణ కోసం కలలుగన్న ప్రొఫెసర్ జయశంకర్ సార్ దగ్గర నుండి ఎంతోమంది తెలంగాణ రాష్ట్రం కొరకు రాజకీయ జీవితాన్ని ప్రజాక్షేత్రంలో నిరాటంకంగా కొనసాగించారు...

**అలాంటి వారిలో ఈటల రాజేందర్ ని పక్కన పెట్టేశాడు... ఆ దెబ్బ గట్టిగా కనబడకుండా కేసీఆర్ కి తాకిన, కెసిఆర్ ఆనాడు పట్టించుకోలేదు... అది కాక 2018 లోనే మరోసారి దక్కించుకున్నాక తెలంగాణ ఉద్యమ ద్రోహులను తన క్యాబినెట్లో మంత్రులుగా నియమించుకున్నాడు.. ఇదే తన రాజకీయ జీవితానికి సమాధిగా మొదలైంది... తెలంగాణ సమాజం మొత్తం వ్యతిరేకించిన ఏకపక్ష నిర్ణయాలతో సీఎం కేసీఆర్ అంటే మాట ఇస్తే తప్పడు అనే విధంగా రెండుసార్లు ఎన్నో హామీలు ఎన్నో ప్రకటనలు చేసిన, వాటిలో సంక్షేమ పథకాలను విరివిగా తెలంగాణ ప్రజలకు అందించాడు... అందులో పింఛన్లు ఒంటరి మహిళలకు వితంతువులకు వికలాంగులకు వారి ఆత్మ గౌరవాన్ని నిలబడే విధంగా పింఛన్లను పెంపు చేశాడు. అంతేకాకుండా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే దిశగా నవోదయ స్కూల్ లను గురుకులాలను వృద్ధిచేసి దళిత గిరిజన జాతి విద్యార్థులను ఉన్నత స్థానానికి తీసుకొచ్చేలా ప్రయత్నం చేశారు.. అంతేకాకుండా తెలంగాణ ఆడబిడ్డలకు పెళ్లీడు సమయంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి గొప్ప పథకాలను అందించి ఆడపిల్ల పుడితే వారి కల్యాణానికి ఇబ్బంది పడే తల్లిదండ్రులకు ఆపద్బాంధవుడుగా నిలిచి తానే పెళ్లి చేశాడు...**

(మిగతాది రేపటి సంచికలో)






# జడ్పీటీసీ నుంచి సీఎం కుర్చీ దాకా..



✍ జయభేరి, హైదరాబాద్ :

ఆయన.. ప్రత్యర్థులకు చుక్కలు చూపించే నాయకుడు. ప్రజల నాడి పట్టి వారిలో చైతన్యం నింపే నేత. 20 ఏళ్లుగా ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రజా సమస్యలే ధ్యేయంగా అలుపెరగని పోరాటం చేసిన లీడర్. ఈ అంశాలే ఆయన్ని పురాతన జాతీయ పార్టీకి రాష్ట్ర బాధ్యతలు చేపట్టేలా చేసింది. అదీ అనధి కాలంలోనే. ఇప్పుడు ఏకంగా సీఎం రేసులోకి రావడంతో తెలంగాణ ప్రజల చూపంతా ఆ నేతపైనే ఉంది. ఇప్పటికే మీకర్థం అయి ఉంటుంది. ఆయనెవరో కాదు.. అనుముల రేవంత్ రెడ్డి. పెయింటర్ నుంచి యువ నాయకుడిగా ఎదిగి.. సీఎం కేసీఆర్ను ఢీ కొట్టి తన రాజకీయ ప్రయాణానికి సుస్థిర బాటలు వేసుకున్న రేవంత్ జీవిత చరిత్ర గురించి తెలుసుకుందాం..

## వ్యక్తిగత విషయాలు..

రేవంత్ రెడ్డి 1969 నవంబర్ 8న నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో జన్మించారు. ఆయన సతీమణి గీత. తండ్రి అనుముల నర్సింహారెడ్డి, తల్లి అనుముల రామచంద్రమ్మ. ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి గ్యాడ్యుయేషన్ పట్టా పొందారు. రేవంత్ రెడ్డికి తొలుత ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు. ఆయన కింది స్థాయి నుంచి రాజకీయ నేతగా ఎదిగారు. మొదట జడ్పీటీసీ ఇండిపెండెంట్ గా గెలిచారు. అప్పట్లో కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్(బీఆర్ఎస్), బీజేపీ వంటి పార్టీలను ఎదుర్కొని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని మిడ్జిల్ నుంచి 2007లో జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. ఈ గెలుపుతో పార్టీలన్నీ ఒక్కసారిగా రేవంత్ వైపు చూసేలా చేశాయి. అక్కడే ఆయన నాయకత్వం బయటపడింది. తర్వాత ఎమ్మెల్సీగా గెలిచారు. అప్పటికే అధికారంలో ఉన్న కాంగ్రెస్.. పార్టీలో జాయిన్ కావాలని ఆహ్వానించినా.. దివంగత సీఎం ఎన్టీఆర్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉన్న అభిమానంతో టీడీపీలో చేరారు. తెలుగుదేశం పార్టీ నుంచి 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ అభ్యర్థులు రావులపల్లి గుర్నాథ్ రెడ్డి పై విజయం సాధించారు. ఆ విజయం ఆయన చరిష్మాను మరింతగా పెంచింది. తెలంగాణ ఏర్పడ్డాక జరిగిన 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరఫున మరోసారి బరిలోకి దిగి ఆయన ఘన విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో టీఆర్ఎస్ అధికారం చేపట్టింది. అప్పటి నుంచి అధికార పార్టీకి వ్యతిరేకంగా పోరాడుతూ ఉండేవారు.
2014 - 2017 మధ్య టీడీఎల్పీ ఫ్లోర్ లీడర్గా ఉన్నారు. 2017 అక్టోబర్లో తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి, కాంగ్రెస్ పార్టీలో చేరారు. 3 ఏళ్ల అనధికాలంలోనే ఎవ్వరికీ దక్కని హోదాతో కాంగ్రెస్ అధిష్టానం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించింది. 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్గా నియమితులయ్యారు. అనంతరం 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2019 మే లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎంపీగా గెలిచారు. అనంతరం రేవంత్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా (టీపీసీసీ) జూన్ 26, 2021లో కాంగ్రెస్ పార్టీ నియమించింది. 2021 జులై 7న అప్పటి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జీ మాణిక్యం ఠాగూర్ సమక్షంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి కేసీఆర్ పాలనపై వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు. ఆయన్ని ఓడించడం కోసం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సర్వశక్తులూ ఒడ్డారు.





## ఓటుకు నోటు కేసు..

ఇక శాసన మండలి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయడానికి నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్సన్కు లంచం ఇవ్వజూపిన కేసులో మే 31 2015న, రేవంత్ రెడ్డిపై స్టింగ్ ఆపరేషన్ చేసి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అరెస్టు చేసింది. అవినీతి నిరోధక చట్టం, సెక్షన్లు 120B (నేరపూరిత కుట్ర) సెక్షన్ల కింద క్రిమినల్ కేసు - ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 34 కింద రేవంత్తో పాటు మరో ఇద్దరు బిషప్ సెబాస్టియన్ హ్యారీ, ఉదయ్ సింహాలను అరెస్ట్ చేసింది. వీరిని చర్లపల్లి సెంట్రల్ జైలుకి తరలించింది. జూన్ 30న వీరికి తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. 2015 జులై 1న రేవంత్ రెడ్డి విడుదలయ్యారు. ఈ కేసు తాలూకు చేదు అనుభవాలు ఇప్పటికీ రేవంత్ని వెంటాడుతున్నాయి. ఏదేమైనా రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఇప్పుడు కాంగ్రెస్ ముందు ఆరు గ్యారంటీ స్కీమ్లు ఉన్నాయి. అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవల్సి ఉంటుంది. ఎలా ముందుకెళ్తారో వేచి చూడాలి.



## మొక్కులు చెల్లించుకున్న సర్పంచ్ గుర్క కుమార్ యాదవ్

✍ జయభేరి, జయభేరి, డిసెంబర్ 4:

అసెంబ్లీలో ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే గా మల్లారెడ్డి గెలుపొందడంతో శామీర్ పేట్ మండలం అలియబాద్ గ్రామంలోని శివాలయం లో సర్పంచ్ గుర్క కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం మల్లారెడ్డి విజయం సాధిస్తే ముడుపు చెల్లిస్తామని అనుకోవడంతో ఆ మొక్కులు కూడా చెల్లించుకున్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే గా మల్లారెడ్డి మరోసారి గెలుపొందడం ఎంతో సంతోషంగా ఉందని, మల్లారెడ్డి నాయకత్వం లో నియోజకవర్గం మరింత ముందుకు వెళ్తుందని ధీమా వ్యక్తంచేశారు.



## మల్లారెడ్డికి అభినందనలు
### చిందు వనజ శ్రీనివాస్ రెడ్డి

✍ జయభేరి, జయభేరి, డిసెంబర్ 4 :

మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే గా మల్లారెడ్డి విజయం సాధించడం పట్ల ఆయనపై ప్రజల్లో ఎంతో నమ్మకం ఉందని లాల్ గడి మలక్ పేట్ సర్పంచ్ చిందు వనజ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు ఆకుల వెంకటేష్, హరి బాబు, నాగేష్,పేర్కొన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డికి వారు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అభివృద్ధి కి నోచుకోని మారు మూల గ్రామాలు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాకే వాటి రూపురేఖలు మారాయని గుర్తు చేశారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి సైతం నియోజకవర్గ0లో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేసి అన్ని రంగాల్లో ముందుంచారని వెల్లడించారు. మల్లారెడ్డి మున్ముందు మరిన్ని పనులు చేపట్టాలని వారు కోరారు...



## బీఆర్ఎస్ గెలుపు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

◆ మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్

✍ జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం దయానంద్ యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ గెలుపుకు విశ్రాంతి అనేది లేకుండా కష్టపడ్డ మార్కెట్ కమిటీ చైర్మన్, జడ్పీటిసి, ఎంపిపి లకు పార్టీ సర్పంచ్ లకు, ఎంపీటీసీలకు, సొసైటీ చైర్మన్5, డైరెక్టర్లకు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యదర్శులకు, నాయకులకు, కార్యకర్తకు, అభిమానులకు, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరిని బీఆర్ఎస్ పార్టీ గుర్తిస్తుందన్నారు. మేడ్చల్ లో బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి గెలుపే లక్ష్యంగా రాత్రింబవళ్లు శ్రమించిన ప్రతి ఒక్కరికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. ఈ 5 సంవత్సరాలు పార్టీని మేడ్చల్ నియోజకవర్గంలో మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. అదేవిదంగా మేడ్చల్ నుండి గెలుపొందిన బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డికి మేడ్చల్ మండలం తరపునా, నాయకుల తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు.

ప్రభాత జయభేరి
jayabheridaily.com



ఎర్రవెల్లి లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ను మర్యాద పూర్వకంగా కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎన్నికల ఇంఛార్జి రావుల శ్రీధర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేసినారు.

జయభేరి, కాప్రా



తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ను మర్యాద పూర్వకంగా కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పుష్పగుచ్ఛము అందించి శుభాకాంక్షలు తెలియజేసినారు.

జయభేరి, కాప్రా

# ఘనంగా శశికుమార్ గురుస్వామి 18వ మహ పడిపూజ

**జయభేరి, మేడ్చల్ :**
మండలంలోని పూడూర్ గ్రామంలోని అయ్యప్ప దేవాలయంలో గ్రామ వార్డు సభ్యులు ఇటబోయిన శశికుమార్ యాదవ్ గురుస్వామి 18వ మహాపడి పూజ కన్నుల పండుగగా జరిగింది. పడిపూజ సందర్భంగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. సోమవారం ఉదయం అర్చకులు వెంకటేశ్ శర్మ బృందం మంత్రోచ్చరణల మధ్య శశికుమార్ గురుస్వామి మణికంఠుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించి 18 మెట్ల పడి వెలిగించారు. గురుస్వాములు రాజేశ్వర్, మాధవచారి, మల్లారెడ్డిలు 18వ ఏటా శబరియాత్ర చేస్తున్న శశికుమార్ గురుస్వామికి ఆశీర్వాదాలు అందించి నారికేళ మొక్క, మంత్రదండాన్ని అందించారు. మహాపడిపూజలో వివిధ గ్రామాల నుండి అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనగా గాయకుడు ఈటపంటి శ్రీనివాసరాజు అయ్యప్ప పాటలు, భక్తుల అయ్యప్ప నామస్మరణతో ఆలయం వద్ద, గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ బాబు యాదవ్, నాయకులు సోమేశ్ యాదవ్, కిట్టు యాదవ్, వార్డు సభ్యులు, నాయకులు, అయ్యప్ప స్వాములు శశికుమార్ గురుస్వామిని ఘనంగా సన్మానించారు. పూజలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.







# కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

**జయభేరి, మేడ్చల్ :**
కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలించి ప్రజల విశ్వాసం పొందుతుందని మేడ్చల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉద్దండపురం సత్యనారాయణ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజారిటీ రావడంతో మేడ్చల్ పట్టణంలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు అంబరాన్ని అంటాయి.సోమవారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉద్దండపురం సత్యనారాయణ ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలోని అంబెద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. అనంతరం బాణసంచా కాల్చి,స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ అవినీతి పాలనకు స్వస్తి చెప్పి ప్రజలు మార్పు కోరుకున్నారని అందుకే కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటిలను అమలు చేసి ప్రజాపాలన అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోమారం రమణారెడ్డి, మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ చాప రాజు, ఎల్లంపేట్ గ్రామ సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడు, ఎంపిటిసి కుమార్ యాదవ్, నాయకులు గోమారం బాల్ రెడ్డి, మల్లేష్ గౌడ్, వరదరెడ్డి, రేగురాజు, రవి ముదిరాజ్ ,మురళి తదితరులు పాల్గొన్నారు.






# ఎమ్మెల్యే లకు శుభాకాంక్షలు

**జయభేరి, మేడిపల్లి :**
తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ బీఅర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చమకూర మల్లారెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిచిన సందర్భంగా పీర్జాదిగుడా 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ ప్రజలు తపకాయలు పేల్చి స్వీట్స్ పంచి సంబరాలు చేశారు. అనంతరం మేయర్ జక్క వెంకట్ రెడ్డి, 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, డివిజన్ బూత్ కమిటీ సభ్యులు, అధ్యక్షకార్యదర్శులతో కలిసి చమకూర మల్లారెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మల్కాజిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# మల్లారెడ్డి.. మర్రికి శుభాకాంక్షలు తెలిపిన మేడ్చల్ నాయకులు

**జయభేరి, మేడ్చల్ :**
ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ నిత్యం ప్రజలలో ఉండే గొప్ప నాయకుడు మాజీ మంత్రి మల్లారెడ్డి అని మేడ్చల్ 23వ వార్డు కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ అన్నారు. సోమవారం మేడ్చల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చెర్వుకొమ్ము శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో మేడ్చల్, మల్కాజ్ గిరి నియోజకవర్గల నుండి ఘన విజయం సాధించిన చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి లను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పూల బొకే అందజేసి హర్థిక శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మాట్లాడుతూ... మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించి మల్లారెడ్డి చరిత్ర సృష్టించారని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో మల్లారెడ్డి చేసిన అభివృద్ధి, నియోజకవర్గంలో దేవాలయాల నిర్మాణాలు, కుల సంఘాల భవనాలకు సొంత నిధులతో అభివృద్ధి చేసి ప్రతిఒక్కరికి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందజేశారన్నారు.మల్లారెడ్డి చేసిన అభివృద్ధి పనులను ప్రజలు మరిచిపోలేదని, ప్రతి ఇంటిలో ప్రభుత్వ పథకాలైన ఆసరా పెన్షన్, కల్యాణ లక్ష్మి వంటి, బిసి బంధు, రైతు బంధు, దళిత బంధు, రైతు భీమా సియం రిలీఫ్ ఫండ్ ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేసిన నాయకుడు మల్లారెడ్డి అని ఆయన చేసిన సేవకు ప్రజలు అఖండ మెజారిటీతో మల్లారెడ్డిని మూడవసారి గెలిపించారన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో మల్లారెడ్డి గెలుపు అనుక్షణం శ్రమించిన బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులకు,నాయకులకు,కార్యకర్తలకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ లు నడికొప్పు ఉమా నాగరాజు ముదిరాజ్, పెంజర్ల స్వామి యాదవ్, మేడ్చల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చెర్వుకొమ్ము శేఖర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ దుబ్బ రామస్వామి ముదిరాజ్, ఉపాధ్యక్షులు మెరుగు మోహన్ రెడ్డి, నాయకులు నడికొప్పు బాలమల్లేష్ ముదిరాజ్, పెంజర్ల భాస్కర్ యాదవ్, కౌడే నాగేందర్ కురుమ, ఒగ్గు శంకర్ కురుమ, కౌడే వెంకటేష్ కురుమ, కౌడే శ్రీశైలం కురుమ, ఉద్దెమర్రి రాజు ముదిరాజ్, మొలంగిరి విజయ్ కుమార్ చారి,ఉద్దెమర్రి విజయ్ కుమార్ ముదిరాజ్,రామన్నగారి రాఘవేందర్ గౌడ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# కొంప ముంచిన అతివిశ్వాసం

**హైదరాబాద్, డిసెంబర్ 4 :**
మంచోళ్లమని ప్రచారం చేస్తున్నారా.. చెడ్డోళ్లమని ప్రచారం చేస్తున్నారా అన్నది కాదు ముఖ్యం.. మన గురించి ఏదో ఒకటి ప్రచారం చేస్తున్నారా లేదా అన్నదే రాజకీయ నాయకులకు కీలకం " అని బ్రిటిష్ మాజీ ప్రధాని విన్ స్టన్ చర్చిల్ చెబుతారు. ఆయన ఈ మాట చెప్పి శతాబ్దాలు అయి ఉండవచ్చు కానీ.., రాజకీయాల్లో ఇప్పటికీ ఇది ప్రధానాంశమే. ఏ విషయంలో అయినా ప్రచారం అతి కాకూడదు. ముఖ్యంగా ప్రత్యర్థికి తామే సొంతంగా ప్రచారం ఇవ్వాలనుకుంటే... దాన్ని పరిమితుల్లోనే ఉంచాలి. లేకపోతే అది ప్లస్ అయిపోతుంది. ఈ విషయంలో బీఆర్ఎస్ తప్పిదం చేసింది. కాంగ్రెస్ పార్టీకి మేలు చేసింది. భారీ బహిరంగసభలు పెట్టి కేసీఆర్ సహా అగ్రనేతలంతా కాంగ్రెస్ కు ప్రచారం చేశారు. భారత రాష్ట్ర సమితి ప్రచార సరళి పూర్తిగా కాంగ్రెస్ కేంద్రంగానే సాగింది. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత ఇలా ఎవరు ప్రచారానికి వెళ్లినా ప్రసంగాల్లో ప్రధానంగా కాంగ్రెస్ నే టార్గెట్ చేశారు. కాంగ్రెస్ కు ఓటు వేయవద్దని వేడుకున్నారు. బీఆర్ఎస్ ప్రచార వ్యూహం ఎలా ఉందంటే.. చివరికి సొంత పార్టీ మేనిఫెస్టో గురించి ఆ పార్టీ నేతలు సభల్లో ఎక్కువగా ప్రచారం చేయలేదు. తెలంగాణ సీఎం కేసీఆర్తో పాటు భారత రాష్ట్ర సమితి నేతలకు తాము పదేళ్లలో తెలంగాణను బంగారు తునక చేశామన్న గట్టి నమ్మకంతో ఉన్నారు. అభివృద్ధికి అభివృద్ధి.. సంక్షేమానికి సంక్షేమం .. తమ పాలనలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జరగనంత జరిగాయని ధీమాతో ఉన్నారు. అదే దిశగా ప్రచారం కూడా ప్రారంభించారు. కానీ అభ్యర్థుల్ని ప్రకటించిన తర్వాత పూర్తిగా పాజిటివ్ ఓటుతోనే గెలుస్తామన్న నమ్మకం పోయిందేమో కానీ.. కాంగ్రెస్ వస్తే ఏదో జరిగిపోతుందన్న ప్రచారాన్ని ప్రారంభించారు. మొదట్లో కాంగ్రెస్ పై విమర్శలకు చాలా తక్కువ సమయం కేటాయించిన ఆ పార్టీ నేతలు.. తర్వాత తర్వాత కాంగ్రెస్ ను మాత్రమే టార్గెట్ చేసి.. ప్రచారం చేశారు. మూడో సారి అధికారంలోకి రాగానే నాలుగు వందలకే గ్యాస్ సిలిండర్లు ఇచ్చే హామీ టీఆర్ఎస్ ఇచ్చిందని పేదలకు తెలియలేదు. కాంగ్రెస్ ఐదు వందలకు ఇస్తామన్న హామీ మాత్రం ప్రజల్లోకి వెళ్లింది. ఓటు ప్రాధాన్యాన్ని .. రాజకీయ పార్టీల నిజాయితీని.. కాంగ్రెస్ పార్టీ మోసకారి అంటూ ఎప్పుడూ చెప్పుకొచ్చారు. మూడో సారి గెలిస్తే తాము ఏం చేయబోతున్నామో చెప్పేందుకు పెద్దగా ఆసక్తి చూపించ లేదు. ఎప్పటికప్పుడు కాంగ్రెస్ ను డీగ్రేడ్ చేయడానికే ఎక్కువ సమయం కేటాయించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత మారిన పరిస్థితుల్ని బట్టే కేసీఆర్ కాంగ్రెస్ ను ఎక్కువగా టార్గెట్ చేసుకుంటున్నారని అనుకున్నారు. కానీ ఈ విషయం ప్రజల్లోకి మరో విధంగా వెళ్లింది. కాంగ్రెస్ గెలవబోతోందని నమ్మబట్టే ఇలా ప్రచారం చేశారని ప్రజలు అనుకున్నారు. చివరికి బీఆర్ఎస్ చేసిన ప్రచారం ఎలా మారిందంటే ఇక కాంగ్రెస్ గెలవబోతోంది... ప్రజలు ఆ పార్టీకే ఓటు వేయాలని డిసైడ్ అయ్యారు.. వారి మనసు మార్చాలన్నట్లుగా ప్రచారం సాగింది. కాంగ్రెస్ కు ఓటు వేస్తే ఏం జరుగుతుందో భయపెట్టే ప్రయత్నం చేశారు. పదేళ్ల పాలనపై వ్యతిరేకత అనేది ఏ ప్రభుత్వానికైనా సహజంగానే ఉంటుంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఓ ప్రభుత్వపై పౌరుడు అసంతృప్తి పెంచకోవడానికి ఎన్నో కారణాలు ఉండాల్సిన పని లేదు. అలాంటి గండం బీఆర్ఎస్ కు ఉంది. ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీ.. ఆరు గ్యారంటీలు.. మేనిఫెస్టో పేరుతో విస్తృతంగా ప్రచారం చేసుకుంది. ప్రజల చాయిస్ కాంగ్రెస్ అనే అంశంపై కేసీఆర్ కు స్పష్టమైన నివేదికలు వచ్చి ఉంటాయని కాంగ్రెస్ వస్తే.. ఏదో జరిగిపోతుందని..కరెంట్ ఉండదనే దగ్గర్నుంచి ఐటీ పరిశ్రమలు బెంగళూరు వెళ్లిపోతాయన్న వరకూ అన్ని రకాల ప్రచారాలు చేస్తున్నారని అనుమానించారు. నిజానికి తమ గురించి కూడా పెద్దగా చెప్పుకోకుండా ఎదుటి పార్టీకి ఓటేయవద్దని చేసే ప్రచారం సక్సెస్ అయ్యేది చాలా తక్కువ. రిస్క్ తీసుకుని బీఆర్ఎస్ ఇప్పుడు అదే ప్రచారం వ్యూహం పాటించింది.

# ఇక జాతీయ రాజకీయాల్లోకి కేసీఆర్

**జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 4 :**
వచ్చే లోక్సభ ఎన్నికల్లో కేసీఆర్ బరిలో ఉంటారని తెలుస్తోంది. అసెంబ్లీకి వెళ్లడం కన్నా.. పార్లమెంట్కు వెళ్లడమే మేలని.. అదే ఈ ఉద్యమనేతకు, సీఎంగా చేసిన కేసీఆర్ కు గౌరవంగా భావిస్తున్నట్లు సమాచారం.తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత బీఆర్ఎస్కు విచిత్ర పరిస్థితి ఎదురు కానుందా అంటే అవుననే అంటున్నారు విశ్లేషకులు. ఎన్నికల్లో కాంగ్రెస్ మ్యాజిక్ ఫిగర్ను దాటి సీట్లను గెలిచింది. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్లో సీఎం అభ్యర్థిపై చర్చ మొదలైంది. రాత్రికి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే.శివకుమార్ కీలక సమావేశం నిర్వహించబోతున్నారు. సోమవారంమే ప్రమాణస్వీకారం ఉంటుదన్న లీకులు వస్తున్నాయి. అయితే ఎన్నికలకు ముందే రేవంత్ ప్రకటించినట్లుగా డిసెంబర్ 9న ప్రభుత్వం కొలువు దీరుతుందా అన్నది రేపటిలోగా క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.ఇదిలా ఉంటే బీఆర్ఎస్ను ప్రజలు ప్రతిపక్షానికి పరిమితం చేశారు. ప్రజలు అప్పగించిన కొత్త బాధ్యతను విశ్వాసంతో నిర్వహిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ఓటమిపై సమీక్ష నిర్వహించుకుంటామని తెలిపారు. ప్రతిపక్ష బాధ్యతను నిర్వహించే బీఆర్ఎస్కు శాసన సభా పక్ష నేతగా ఎవరు ఉంటారన్న చర్చ బీఆర్ఎస్తోపాటు తెలంగాణ ప్రజల్లో జరుగుతోంది.

తొమ్మిదన్నరేళ్లు సీఎంగా బాధ్యతలు నిర్వహించిన కేసీఆర్.. ఇప్పుడు అవమాన భారంతో కనీసం గవర్నర్ కు నేరుగా రాజీనామా లేఖ పంపకుండా తన ఓఎస్డీకి ఇచ్చేసి ప్రగతిభవన్ ను ఖాళీ చేసి తన ఫాంహౌస్ కు వెళ్లిపోయారు. సీఎంగా అన్నేళ్లు చేసి ఒక సాధారణ ఎమ్మెల్యేగా ప్రతిపక్షంలో కూర్చుంటారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చంద్రబాబు నాయుడు మూడు పర్యాయాలు సీఎంగా పనిచేసినా వైఎస్సార్ హయాంలో, ప్రస్తుతం జగన్ హయాంలో విపక్ష నేతగా ఉన్నారు. కానీ, తెలంగాణలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో కేసీఆర్ వ్యక్తిత్వం, ఆయన అహంకార ధోరణి, అధికార కాంగ్రెస్ ఎదుట తలెత్తుకుని నిలబడతారా అన్నది ఆసక్తిగా మారింది. మరోవైపు బీఆర్ఎస్లో పార్టీ శాసన సభాపక్ష నేతగా కేటీఆర్ ఉంటారన్న చర్చ కూడా మొదలైంది.ప్రస్తుత పరస్థితుల్లో కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవచ్చని తెలుస్తోంది. ఆయన త్వరలో జరిగే లోక్సభ ఎన్నికల్లో మెదక్ నుంచి పోటీ చేసి పార్లమెంట్కు వెళ్తారని తెలుస్తోంది.

ప్రస్తుతం మెదక్ ఎంపీగా కొత్త ప్రభాకర్రెడ్డి ఉన్నారు. ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక నుంచి గెలిచారు. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో వచ్చే లోక్సభ ఎన్నికల్లో కేసీఆర్ బరిలో ఉంటారని తెలుస్తోంది. అసెంబ్లీకి వెళ్లడం కన్నా.. పార్లమెంట్కు వెళ్లడమే మేలని.. అదే ఈ ఉద్యమనేతకు, సీఎంగా చేసిన కేసీఆర్ కు గౌరవంగా భావిస్తున్నట్లు సమాచారం.



# ఓటమి పక్కన పెట్టి చర్చిద్దాం రండి

**జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 4**
శీతాకాల సమావేశాల ప్రారంభమయ్యే ముందు ప్రధాని నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను ప్రస్తావించారు. ప్రతిపక్ష పార్టీలు ఓటమిని పక్కన పెట్టి చర్చలకు సహకరించాలని కోరారు. ఓడిపోయామన్న ఫ్రస్ట్రేషన్ని పార్లమెంట్ సమావేశాల్లో చూపించొద్దని సూచించారు. డిసెంబర్ 3న విడుదలైన ఎన్నికల ఫలితాల్లో ఛత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్లో బీజేపీ ఘన విజయం సాధించింది. కాంగ్రెస్ చేతిలో ఉన్న ఛత్తీస్గఢ్, రాజస్థాన్ కూడా కమల దళం వశమయ్యాయి. తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ మెజార్టీ సాధించింది. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలని, విద్వేషాలు ప్రచారం చేయడం ఆపేయాలని స్పష్టం చేశారు. "ఎన్నికల ఫలితాల విషయానికొస్తే...ప్రతిపక్షాలకు ఇదో మంచి అవకాశం. ఈ సమావేశాల్లో అందరూ సహకరించాలి. ఓడిపోయామన్న బాధని, ఆక్రోశాన్ని సమావేశాల్లో చూపించడం సరికాదు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని సానుకూలంగా ముందుకెళ్లాలి. గత 9 ఏళ్లుగా నెగటివిటీని ప్రచారం చేసింది చాలు. ఇప్పటికైనా మారితే ప్రజల్లో ఈ పార్టీలపై ఉన్న అభిప్రాయం కొంతైనా మారుతుందని అనుకుంటున్నాను. నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు మాకెంతో ఉత్సాహాన్నిచ్చాయి"

**- ప్రధాని నరేంద్ర మోదీ**

దేశ ప్రజలు నెగటివిటీని తిప్పికొట్టారని స్పష్టం చేశారు ప్రధాని మోదీ. ఈ సమావేశాలు ప్రారంభం కాకముందే...ప్రతిపక్ష నేతలతో భేటీ అయినట్టు వెల్లడించారు. అందరూ శీతాకాల సమావేశాలకు సహకరించాలని కోరినట్టు చెప్పారు. లోక్సభ ప్రజాస్వామ్యానికి దేవాలయం లాంటిదని...ఇక్కడ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాల్సిన అవసరముందని హితవు పలికారు.మధ్యప్రదేశ్లో బీజేపీ ఘన విజయం సాధించింది. ఎగ్జిట్ పోల్ అంచనాలు కొంత వరకూ కాంగ్రెస్కి పాజిటివ్ వేవ్ ఉందని చెప్పినా ఫలితాలు మాత్రం పూర్తిగా బీజేపీ వైపే మొగ్గు చూపాయి. 230 నియోజకవర్గాలున్న మధ్యప్రదేశ్లో ప్రభుత్వ ఏర్పాటుకి 116 సీట్లు సాధించాలి. ఈ మేజిక్ ఫిగర్ కన్నా ఎక్కువ సీట్లే గెలుచుకుంది బీజేపీ. మొత్తం 163 స్థానాల్లో విజయం సాధించింది. అటు రాజస్థాన్, ఛత్తీస్గఢ్లోని అధికార కాంగ్రెస్ని కూలదోసి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది.

# జయభేరి సినిమా




## ఎంజాయ్ చేసిన భూమి పెడ్నేకర్


బాలీవుడ్ భామ భూమి పెడ్నేకర్ ఫుడ్ లవర్‌గా భిన్న రుచులను ఆస్వాదించే ఫొటోలను ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేస్తుంటుంది. లేటెస్ట్‌గా సండేను మహారాష్ట్ర వంటకాలతో ఎంజాయ్ చేసిన ఇమేజ్‌లను పోస్ట్ చేసింది. మహారాష్ట్రియన్ క్యూజిన్ పట్ల తన ఇష్టాన్నిసోషల్ మీడియా వేదికగా ఆమె చాటుకుంది. వెరైటీ మసాలాలు, కరివేపాకు, స్పైసెస్‌తో కూడిన సాబుదానా కిచిడీని పోస్ట్ చేసిన భూమి మరో స్లైడ్‌లో మిసాల్ రెసిపీని చూపింది. ఫుడీగా పేరొందిన భూమి పెడ్నేకర్ పలుమార్లు తనకిష్టమైన డిష్‌లను పోస్ట్ చేయడంలో ఏమాత్రం తటపటాయించదు. ఇన్‌స్టా స్టోరీస్‌లో ఘుమఘుమలను వడ్డించడంలో భూమి పెడ్నేకర్ ముందుంటుంది. గతంలో రియా కపూర్ ఇంట్లో జరిగిన థ్యాంక్స్ గివింగ్ వేడుకలకు సంబంధించిన ఫుడ్ ఐటెమ్స్‌ను కూడా ఆమె సోషల్ మీడియాలో డిస్‌ప్లే చేశారు.



## యుద్ధానికి సమయం ఖరారు?

'ధూమ్' సిరీస్‌లో జాన్‌అబ్రహం, హృతిక్, ఆమీర్‌ఖాన్‌లు పోషించిన సూపర్‌హీరోస్ పాత్రలపై ఓ బుక్ రాయొచ్చు. భారతీయ వెండితెరకు హాలీవుడ్ హంగులద్దిన పాత్రలవి. వాటి ప్రేరణతో 'వార్' చిత్రాన్ని కూడా నిర్మించింది యష్‌రాజ్ సంస్థ. ఇప్పుడు 'వార్2'కి రెడీ అయ్యింది. ఇందులో సూపర్‌హీరోగా మన టాలీవుడ్ స్టార్ తారక్ కనిపించనుండటం విశేషం. ఇది తెలుగు ప్రేక్షకులందరూ ఆనందించాల్సిన, గర్వించాల్సిన విషయమే. ప్రస్తుతం 'దేవర' షూటింగ్‌లో బిజీగా ఉన్న తారక్ 'వార్2' షూటింగ్‌లోకి ఎంట్రీ ఇచ్చేదెప్పుడు? అనే విషయంపై గతంలో పలురకాల వార్తలు వచ్చాయి. లేటెస్ట్ అప్‌డేట్ ఏంటంటే.. వచ్చే ఏడాది మార్చి రెండోవారం నుంచి తారక్ 'వార్2' షూటింగ్‌లో పాల్గొనబోతున్నాడు. రెండువారాలపాటు ఈ షెడ్యూల్ జరుగుతుందని తెలిసింది. మళ్లీ ఏప్రిల్‌లో 'దేవర' షెడ్యూల్‌లో పాల్గొంటాడు తారక్. మళ్లీ మే నెలలో 'వార్2' షెడ్యూల్ ఉంటుందట. ఈ షెడ్యూల్‌లో హృతిక్, తారక్‌లపై యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించనున్నాడు. దీనికోసం హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్‌స్‌ని రంగంలో దించుతున్నారనేది లేటెస్ట్ న్యూస్. ఇక 'వార్2' కథ విషయానికొస్తే.. ఇది ఇద్దరు స్నేహితుల కథ అని తెలుస్తున్నది. కొన్ని కారణాల వల్ల ఇద్దరూ విడిపోతారట. కానీ మంచి కోసం మళ్లీ కలిసి చెడుపై యుద్ధం చేస్తారట. ఆ ఇద్దరు స్నేహితులుగా హృతిక్, తారక్ నటిస్తుండగా, జాన్‌అబ్రహం ఇందులో నెగిటీవ్ పాత్ర పోషించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. కైరా అద్వానీ కథానాయికగా ఖరారైనట్టు తెలుస్తున్నది.





## 'నా సామి రంగ' అచ్చ తెలుగు వరలక్ష్మి

అగ్ర హీరో నాగార్జున నటిస్తున్న తాజా చిత్రం 'నా సామి రంగ'. విజయ్ బిన్ని దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి శ్రీనివాస చిట్టూరి నిర్మాత. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ కథానాయికగా నటిస్తున్నది. సోమవారం ఆమె ఫస్ట్‌లుక్‌కు విడుదల చేశారు. వరలక్ష్మి పాత్రలో ఆమె సంప్రదాయ దుస్తులు ధరించి ఆకర్షయణీయంగా కనిపిస్తున్నది. 'కంప్లీట్ మాస్ యాక్షన్ చిత్రమిది. నాగార్జున పాత్ర గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. కథానాయిక అషికా రంగనాథ్ అభినయ ప్రధానమైన పాత్రను పోషించింది. కథాగమనంలో ఆమె క్యారెక్టర్ కీలకంగా ఉంటుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం. కీరవాణి, కథ, మాటలు: ప్రసన్నకుమార్ బెజవాడ, సాహిత్యం: చంద్రబోస్, దర్శకత్వం: విజయ్ బిన్ని.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com